సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 11 । ఏప్రిల్ । 2024



యాదాద్రిలో ప్రత్యేక క్యూలైన్
యాదాద్రీశుడి సన్నిధికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈఓ భాస్కర్ రావు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. - 8లో



భక్తుల ఘర్షణ
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చిన భక్తులు.. ఆర్టీసీ బస్సుల్లో సీట్ల కోసం ఘర్షణ పడ్డారు. - 8లో



పనులు సాగవు..
రామన్నపేటలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - 9లో

న్యూస్‌రీల్

మంత్రి కోమటిరెడ్డి రంజాన్ శుభాకాంక్షలు



నల్లగొండ: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రంజాన్ సందర్భంగా బుధవారం ఒక ప్రకటనలో ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ధార్మిక చింతనతో ముస్లింలంతా నెల రోజులపాటు దీక్షలు చేపట్టడం వారికున్న మత విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి కష్టాన్ని అధిగమించేందుకు ముస్లింలకు అల్లా శక్తిని ప్రసాదించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్, యాప్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణంలో భాగంగా కంకణధారణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం అర్చన, అభిషేకం చేశారు. అదే విధంగా ప్రధానాలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు గావించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

ఘనంగా వసంత నవరాత్రి ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదాద్రికి అనుబంధంగా కొండపై ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి వసంత నవరాత్రి ఉత్సవాలు బుధవారం రెండవ రోజు వైభవంగా నిర్వహించారు. శివాలయంలో నిత్యారాధనలు ముగిసిన తరువాత శ్రీసీతారామ హనుమత్ మూలమంత్ర జపములు చేపట్టారు. అనంతరం దశశాంతి పంచ సూక్త పారాయణముతో అభిషేకాలు, ఆధ్యాత్మిక రామాయణ పారాయణాలు, శ్రీసీతారామ హనుమత్ మూర్తులకు అష్టోత్తర శత నామార్చన గావించారు. సాయంత్రం శ్రీసీతారామచంద్రస్వామి హనుమత్ మూర్తులకు సహస్ర నామార్చనలు, నివేదన, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద వితరణ పూజలు నిర్వహించారు.

ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్

రామన్నపేట : ప్రతి ఒక్కరూ ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని, అశ్రద్ధ చేయవద్దని రామన్నపేట జూనియర్ సివిల్‌జడ్జీ ఎ.ప్రదీప్ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన, అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, దురలవాట్లను విడనాడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సదస్సులో ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వీరన్న, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎండీ మజీద్, న్యాయవాదులు దూశర్ల నరేందర్‌రావు, జినుకల ప్రభాకర్, మామిడి వెంకట్‌రెడ్డి, బర్ల డేవిడ్, నకిరేకంటి మొగులయ్య, స్వామి, జగతయ్య, వైద్యులు శ్వేతాప్రియాంక, మాధవాచారి, అంకిత, లింగాయాదవ్, ముఖిత్ నర్సింగ్ సూపరిండెంట్ విజయలక్ష్మీ, లీగల్ వలంటీర్లు వెంకటేష్, సాయిదీప్ పాల్గొన్నారు.



భువనగిరిలో ముస్తాబు చేసిన ఈద్గా

నేడు ఈద్ - ఉల్ - ఫితర్

- ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గాలు

భువనగిరిటౌన్ : నెలవంక దర్శనంతో బుధవారం సాయంత్రం రంజాన్ ఉపవాస దీక్షలు ముగిశాయి. 30 రోజుల పాటు దీక్షలు కొనసాగించిన ముస్లింలు.. గురువారం ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్)ను జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రత్యేక ప్రార్థనల కోసం జిల్లాలోని ఈద్గాలు, దర్గాలు, మసీదులను ముస్తాబయ్యాయి. ఇమామ్‌లు ఈద్–ఉల్–ఫితర్ గురించి ఉపదేశించి నియమాలు వివరించి ఖుద్బా పఠిస్తారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటారు.

ప్రజాక్షేత్రంలోకి కాంగ్రెస్

12 నుంచి ఎన్నికల ప్రచారం

- మూడు లక్షల మెజార్టీ లక్ష్యం
- భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, డీసీసీ అధ్యక్షులకు దిశా నిర్దేశం
- అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ



తన నివాసంలో జరిగిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు మందుల సామేలు, అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు

సాక్షి, యాదాద్రి : సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి శ్రీకారం చుట బోతోంది. ఇందులో భాగంగా భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో ఈనెల 12నుంచి నగారా మోగించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్యనేతలు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల కాంగ్రెస్ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో పాటు ఐదుగురు ఎమ్మెల్యేలు, జనగామ ఇన్‌చార్జి, డీసీసీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

గెలుపునకు పక్కా వ్యూహం

భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు కాంగ్రెస్ నాయకత్వం.. పక్కా వ్యూహంతో ముందుకెళ్తోంది. అభ్యర్థిని ప్రకటించి రెండు వారాలు కావస్తున్నా ఇంతవరకు ప్రచారాన్ని ప్రారంభించలేదు. కొన్ని చోట్ల నేతల మధ్య సమన్వయం లేకుండా పోయింది. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు సాధించిన మెజార్టీ స్ఫూర్తిగా లోక్‌సభ ఎన్నికల్లోనూ గెలవాల్సిందేనని సమీక్ష సమావేశంలో రేవంత్‌రెడ్డి సూచించినట్లు డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి 'సాక్షి'తో చెప్పారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా జనగామ మినహా అన్ని చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ప్రాతినిథ్యం వహిస్తున్నారు. వీరంతా భారీ మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే.

నామినేషన్‌కు రానున్న రేవంత్, మే మొదటి వారంలో ప్రియాంకగాంధీ

చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఈనెల 21వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. నామినేషన్ అనంతరం భువనగిరిలో జరిగే బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారు. వచ్చే నెల మొదటి వారంలో ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ నియోజవకవర్గాల పరిధిలో నిర్వహించే ప్రచార సభల్లో పాల్గొంటారు. ఆమెతో పాటు మరికొందరు నేతలు ప్రచారానికి రానున్నారు.

రేపటి నుంచి క్షేత్ర పర్యటనలు

పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం కోసం కాంగ్రెస్ క్షేత్ర స్థాయి పర్యటనలకు శ్రీకారం చుట్టనుంది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ముఖ్య కార్యకర్తలతో విస్తృతంగా సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఈనెల 12న జనగామ, 13న ఆలేరు, 14న తుంగతుర్తి, 15, ఇబ్రహీంపట్నం, 16న భువనగిరి, 17న నకిరేకల్, 18న మునుగోడులో సమావేశాలు నిర్వహిస్తారు. మే నెల 10వ తేదీ వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు కొనసాగనున్నాయి.

పార్టీ కోసం పనిచేసే వారికి ప్రాధాన్యం

ఎంపీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పనిచేసే వారికి ప్రాధాన్యత ఉంటుందని రేవంత్‌రెడ్డి నేతలకు సూచించారు. పదవులు దక్కని వారు కినుక వహించవద్దని కోరినట్లు సమాచారం. పార్లమెంట్ ఎన్నికల తర్వాత వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుర్తింపు ఇస్తామని నాయకులకు సూచించారు.

సమన్వయంతో ముందుకెళ్లాలని..

సమన్వయంతో ఎన్నికల ప్రచారం చేపట్టాలని సమీక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. అభ్యర్థి చామలకిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలు సమన్వయ సమావేశం బుధవారం భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోఆర్డినేటర్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నివాసంలో జరిగింది. అభ్యర్థి విజయం కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 3 లక్షల మెజార్టీ లక్ష్యంగా అన్ని వర్గాల ఓట్లపై కన్నేశారు. క్షేత్ర స్థాయిలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరినట్లు సమాచారం. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అలాగే 50 ఏళ్లు దాటిన ఓటర్లపై దృష్టి సారించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేములవీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జనగామ నియోజకవర్గ ఇంచార్జ్, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, నల్లగొండ, సూర్యాపేట డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



తుర్కపల్లి మండలం మోతీరాంతండాలో గిరిజనులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్



వ్యవసాయ బోరు నుంచి పైపులు వేస్తున్న గిరిజనులు

- అదనపు కలెక్టర్ గంగాధర్
- 'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

తుర్కపల్లి : వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ పేర్కొన్నారు.జిల్లాలో తాగునీటి సమస్యపై సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సమస్య తీవ్రంగా ఉన్న తుర్కపల్లి మండలంలోని మోతీరాంతండాను సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. రెండు నెలలుగా నీళ్లు సరిగా వస్తలేవని గ్రామస్తులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి రెండు వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకొని నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. బోర్ల నుంచి ట్యాంకుల వద్దకు పైప్‌లైన్‌లు వేస్తున్నారు. అనంతరం గోగులగుట్ట తండా, పెద్దతండా, పత్రేబావితండా, మల్కాపూర్, బీల్యానాయక్ తండాలో అదనపు కలెక్టర్ పర్యటించి తాగునీటి సమస్యపై ఆరా తీశారు. ఆయన వెంట ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, డీపీఓ సునంద, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏఈ మోహర్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లకు మోక్షం



వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఆత్మకూరు(ఎం) : మండలంలోని కప్రాయపల్లిలో నిరుపయోగంగా ఉన్న వాటర్‌ప్లాంట్‌ను అధికారులు వినియోగంలోకి తెచ్చారు. 'తాగునీటి గోస' శీర్షికతో బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పదేళ్ల క్రితం గ్రామంలో పైళ్ల శేఖర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయగా నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. అప్పటి నుంచి గ్రామస్తులు క్యాన్ రూ.20 వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ నిరంజన్, డిప్యూటీ తహసీల్దార్ షఫీయోద్దీన్, ఎంపీఓ పద్మావతి, పంచాయతి కార్యదర్శి వాటర్‌ప్లాంట్‌ను పరిశీలించి మరమ్మతులు చేయించారు. సమస్యను వెలుగులోకి తెచ్చిన సాక్షికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా దామోదర్‌రెడ్డి

- తిరిగి నియమిస్తూ తీర్పునిచ్చిన సహకార ట్రిబ్యునల్



బాధ్యతలు స్వీకరించి డైరెక్టర్లు, సిబ్బందితో మాట్లాడుతున్న చింతల దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్ : చౌటుప్పల్ పీఏసీఎస్ చైర్మన్‌గా చింతల దామోదర్‌రెడ్డి తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఆయనపై అవినీతి ఆరోపణలు రావడంతో గత నెల 2వ తేదీన పదవి కోల్పోయారు. సహకార ట్రిబ్యునల్ ఆయనకు అనుకూలంగా తీర్పునివ్వడంతో మళ్లీ బాధ్యతలు స్వీకరించారు. చౌటుప్పల్ పట్టణంలోని బంగారిగడ్డ కాలనీ ప్రాంతంలో గల సింగిల్ విండో కార్యాలయ ప్రాంగణంలో 750 మెట్రిక్ టన్నుల ఎరువుల గోదాము నిర్మించారు. టెండర్లు పిలవకుండా, నిబంధనలకు విరుద్ధంగా చైర్మన్ కాంట్రాక్టర్‌గా వ్యవహరించి నిధులు దుర్వినియోగం చేశారని, సహకార చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా ఇద్దరు వ్యక్తులను పీఏసీఎస్‌లో నియామకం చేశారని వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్ జనవరిలో డీసీఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన జిల్లా సహకార అధికారి ప్రవీణ్‌కుమార్.. చైర్మన్‌ను గత నెల 2వ తేదీన సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదే రోజు వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ విషయమై దామోదర్‌రెడ్డి సహకార ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. కేసును విచారణ చేసిన ట్రిబ్యునల్.. దామోదర్‌రెడ్డిని చైర్మన్‌గా తిరిగి నియమించాలని బుధవారం తీర్పు వెలువరించింది. ఈ మేరకు దామోదర్‌రెడ్డి మరోసారి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. చెన్నగోని అంజయ్య 40 రోజుల పాటు చైర్మన్ పదవిలో కొనసాగారు.

నేడు భువనగిరిలో బీజేపీ సమావేశం

- హాజరుకానున్న రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి
- విజయవంతం చేయాలి : పాశం భాస్కర్



మాట్లాడుతున్న పాశం భాస్కర్

భువనగిరి : బీజేపీ ఎన్నికల ప్రచారంలో మరింత దూకుడు పెంచింది. ఇందులో భాగంగా భువనగిరిలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో గురువారం భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కాసం వెంకటేశ్వర్లు, జి.ప్రేమేందర్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ హాజరుకానున్నట్లు జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ విలేకరుల సమావేశంలో తెలిపారు. బీజేపీకి వాతావరణం అనుకూలంగా ఉందని, కార్యకర్తలు మే 11వ తేదీ వరకు ప్రతి ఓటరును మూడుసార్లు కలిసి పార్టీకి ఓటు వేయాలని కోరాలని పేర్కొన్నారు. భువనగిరిలో జరిగే సమావేశానికి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని బూత్ అధ్యక్షులు, ఆపై స్థాయి నాయకులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, పాపారావు, చిక్కా కృష్ణ, పట్నం శ్రీనివాస్, రత్నపురం బలరాం, పట్నం కపిల్, రాము, సురేష్‌రెడ్డి, నీలం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి : ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే కోరారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై వివరించారు. ఈనెల 18నుంచి కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. సెలవు రోజులు మినహాయించి 25 తేదీవరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఒక అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. అభ్యర్థి వెంట మరో నలుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతించనున్నట్లు పేర్కొన్నారు.నియోజకవర్గంలో ఓటు హక్కు ఉన్న ఒక వ్యక్తి అభ్యర్థిని ప్రతిపాదించవలసి ఉంటుందన్నారు. అభ్యర్థులు కొత్త బ్యాంకు ఖాతా తెరవాలని, దీని ద్వారానే ఎన్నికల వ్యయ లావాదేవీలు నిర్వహించాలన్నారు. అభ్యర్థి గరిష్టంగా రూ.95 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని స్పష్టం చేశారు. క్రిమినల్ కేసులు ఉంటే నామినేషన్ పత్రంలో పొందుపర్చాలన్నారు. ఈనెల 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే సువిధ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బెన్‌షాలోమ్, గంగాధర్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బట్టు రామచంద్రయ్య, బట్టుపల్లి అనూరాధ, కూరవెంకటేశ్, సోమ రవీందర్‌రెడ్డి, ముల్తాన్ షా, రచ్చ శ్రీనివాసరెడ్డి, రత్నపురం బలరాం, ఎడుగాని సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు తీపి కబురు

- 65 ఏళ్లకు రిటైర్మెంట్
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఉద్యోగ విరమణ పొందేవారికి బెన్‌ఫిట్స్
- మరికొన్ని ప్రయోజనాలు కల్పించాలని కోరుతున్న ఉద్యోగులు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు(ఫైల్)

భువనగిరిటౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లు, ఆయాల పదవీ విరమణపై ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఉద్యోగ విరమణ వయస్సు 65 ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా ఉద్యోగ విరమణ సమయంలో టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు బెన్‌ఫిట్ ఇవ్వనుంది.

97మంది రిటైర్మెంట్

రిటైర్మెంట్ పొందిన వారికి లబ్ధిచేకూర్చాలని, అందుకోసం ఏప్రిల్ 30వ తేదీ నాటికి అర్హుల జాబితా అందజేయాలని జిల్లా ఐసీడీఎస్ అధికారులకు ఆదేశాలు అందాయి. ప్రస్తుతం 65 ఏళ్లు నిండి విధుల్లో కొనసాగుతున్న టీచర్లు, సహాయకులు 97 మంది ఉన్నారు. ఇందులో అంగన్వాడీ టీచర్లు 19, సహాయకులు 78మంది ఉన్నారు. తాజాగా పదవీ విరమణపై స్పష్టత ఇవ్వడంతో వారంతా విధులకు సెలవు ప్రకటించవచ్చు. అదేవిధంగా వీరికి రిటైర్మెంట్ బెనిఫిట్ సైతం అందనుంది.

ప్రభుత్వ నిర్ణయంపై భిన్నాభిప్రాయం

రిటైర్మెంట్‌కు సంబంధించి గత ప్రభుత్వం సిద్ధం చేసిన నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని, కొత్తగా లబ్ధి చేకూరేది ఏమీ లేదని అంగన్‌వాడీ ఉద్యోగులు అంటున్నారు. గతంలో ఆందోళన చేపట్టినప్పుడు అప్పటి సర్కార్ కొన్ని సవరణలు చేసిందని, వాటిని ప్రస్తుత జీఓలో పొందపరిచి ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉండేదన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా అంగన్‌వాడీల రిటైర్మెంట్‌పై అంగన్‌వాడీ టీచర్లు, హెల్ప్ యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరపకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకుందని అంటున్నారు. గత డిమాండ్లు పరిష్కరించే వరకు రిటైర్మెంట్ తీసుకోబోమని స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్, ఐసీడీఎస్ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేయనున్నారు.

అన్ని డిమాండ్లు నెరవేర్చాలి



గత ప్రభుత్వం తమ యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి కొన్ని హామీలు ఇచ్చింది. వాటిని రిటైర్మెంట్ బెన్‌ఫిట్ సమయంలో అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం మారడంతో గత సర్కార్ తీసుకువచ్చిన జీవోను రద్దు చేయడం తగదు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. మరిన్ని బెన్‌ఫిట్‌లు పొందుపర్చిన తరువాత రిటైర్మెంట్ అలోచన చేయాలి.

–సీహెచ్. రమాకుమారి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం

ప్రభుత్వం ఆదేశాల మేరకు నడుచుకుంటాం. 65 సంవత్సరాలు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వివరాలు ఇప్పటికే సేకరించి ప్రభుత్వానికి అందజేశాం. రిటైర్మెంట్‌కు ఈనెల 30వ తేదీ నాటికి కటాఫ్ డేట్ పెట్టడం జరిగింది. జిల్లాలో 97 మంది రిటైర్మెంట్ కానున్నారు. వారికి బెనిఫిట్స్ కూడా అందనున్నాయి.

–చంద్రకళ, ఇంచార్జ్ జిల్లా సంక్షేమ అధికారిణి

కాంగ్రెస్‌ది ప్రజారంజక పాలన

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



పార్టీలో చేరినవారిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

భూదాన్‌పోచంపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పెద్ద పీటవేసి ప్రజారంజక పాలన అందిస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలంలోని కనుముకుల గ్రామ మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు పాక జంగయ్యయాదవ్, మాజీ ఉపసర్పంచ్ నిర్మల మోహన్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు గజ్జి సాయికిరణ్‌తో పాటు మరో 20 మంది బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, కొట్టం కరుణాకర్‌రెడ్డి, గోరంటి శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పునూతుల వెంకటేశం, గ్రామ శాఖ అధ్యక్షుడు చుక్క శంకర్, పాక రమేశ్‌యాదవ్, తిరుమలేశ్, కోట సత్తిరెడ్డి, ముదిగొండ రాములు, ఎట్టయ్య, చైతన్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంతానం కోసం పుత్రకామేష్టి యాగం



సాక్షి, హైదరాబాద్ : నవమితో పాటు పుష్యమీ నక్షత్రం కలిసివస్తున్న ఈ నెల 17న మెదక్ జిల్లా నర్సాపూర్‌లో పుత్ర కామేష్టి యాగం నిర్వహిస్తున్నట్లు సువిజ్ఞాన ఆశ్రమం నిర్వాహకులు సత్యవీర్ గురూజీ తెలిపారు. మారిన జీవన విధానాలతో సంతానలేమి సమస్యగా మారిన నేపథ్యంలో ప్రత్యేకంగా ఆడ, మగ బిడ్డల సంతానం కలిగేందుకు అనుభవజ్ఞులైన వైద్యుల ఆధ్వర్యంలో పుత్ర కామేష్టి యాగం నిర్వహిస్తామని తెలిపారు. సంతానం కోసం ఎదురుచూస్తున్న వారు తమ వివరాలను 9248828666 లేదా 7981750006 నంబర్లలో నమోదు చేసుకోవాలని సత్యవీర్ గురూజీ కోరారు.

చేపల మృతిపై విచారణ

కేతేపల్లి : మండలంలోని బొప్పారం ఊర చెరువులో చేపలు మృత్యువాత పడిన ఘటనపై నల్లగొండ జిల్లా మత్స్యశాఖ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. కలెక్టర్ హరిచందన ఆదేశాల ప్రకారం మత్స్యశాఖ అధికారి వెంకయ్య బొప్పారం చెరువులో మృతి చెందిన చేపలను పరిశీలించారు. స్థానిక మత్స్యకారులతో మాట్లాడి వివరాలు సేకరించి మాట్లాడారు. నాలుగు రోజులుగా ఎండ తీవ్రత , కాలుష్య కారకమైన మూసీ నీటి కారణంగా చేపలు మృత్యువాత పడినట్లు భావిస్తున్నట్లు చెప్పారు. చెరువులో విష ప్రయోగం జరిగిందని వస్తున్న ఆరోపణల్లో ఆధారాలు లభించలేదని తెలిపారు. చెరువులో దాదాపు 5 టన్నుల చేపలు మృతి చెందినట్లు తెలిపారు. చెరువులో ఉన్న చేపలను త్వరగా పట్టుకొని విక్రయించుకోవాలని మత్స్యకారులకు సూచించారు. ఘటనపై కలెక్టర్‌కు నివేదిక అందజేయన్నుట్లు తెలిపారు.

యాదాద్రిలో ప్రత్యేక క్యూలైన్

- భక్తులకు ఇబ్బంది లేకుండా శాశ్వత షెడ్డు నిర్మాణం
- తూర్పు మాఢ వీధిలో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటుపై అధికారుల సన్నాహాలు



ఆలయ పశ్చిమ మాఢ వీధిలో చర్చిస్తున్న ఆనంద్‌సాయి, ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రీశుడిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈఓ భాస్కర్‌రావు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వర్షాలు, ఎండల బారినుంచి భక్తులు తప్పించుకునేలా ఆలయ పరిసరాల్లో శాశ్వత షెడ్డు నిర్మాణం చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ధర్మదర్శనం, రూ.150 వీఐపీ ప్రత్యేక దర్శనం టికెట్ భక్తులు క్యూకాంప్లెక్స్ నుంచి ఒకే క్యూలైన్‌లో వస్తున్నారు. దీంతో ధర్మదర్శనంతో పాటు వీఐపీ టికెట్ కొనుగోలు చేసే భక్తులు సైతం ఒకే మార్గంలో రావడం ఏమిటని ఇటీవల ఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో బుధవారం వైటీడీఏ సలహాదారు, ఆర్కెటెక్చర్ ఆనంద్‌సాయితో ఈఓ భాస్కర్‌రావు, సివిల్ అధికారులు దయాకర్‌రెడ్డి, డీఈఓ భాస్కర్‌శర్మలతో కలిసి ఆలయ తిరు, మాఢ వీధులు, ర్యాంప్ మార్గాలను పరిశీలించారు. కొండపైన వీఐపీ పార్కింగ్ ముందు గల ర్యాంప్ మార్గం నుంచి రథశాలకు కలిపి, అక్కడి నుంచి రూ.150 టికెట్ కొనుగోలు చేసే భక్తులను అనుమతిస్తే ఎలా ఉంటుందని అధికారులు చర్చించారు. ర్యాంప్ నుంచి రథశాల వద్దకు వచ్చి, అక్కడి నుంచి ఉత్తర, తూర్పు మాఢ వీధుల మీదుగా ప్రధానాలయంలోకి రూ.150 టికెట్ కొనుగోలు చేసే భక్తులను అనుమతి ఇచ్చేలా క్యూలైన్ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందని, ఏమైనా ఇబ్బందులు ఉంటాయా అనే విషయాన్ని మాట్లాడుకున్నారు. దీనిపై త్వరలోనే ఓ నిర్ణయానికి వచ్చే అవకాశాలున్నాయి. ఇక వేసవి, వర్ష కాలంలో భక్తులు ఇబ్బందులు కలుగకుండా నీడ ఉండే విధంగా ఆలయ నిత్య కల్యాణ మండపంతో పాటు పడమటి రాజగోపురం ముందు నుంచి ఉత్తర మాఢ వీధి, ప్రసాద విక్రయశాలకు వెళ్లె మెట్ల మార్గం వరకు శాశ్వత షెడ్డును ఏర్పాటు చేసేలా పరిశీలించారు. కృష్ణశిల రాయితో నిర్మాణం చేసిన ఆలయ సుందర రూపానికి అటంకం కలుగకుండా షెడ్డును వేయాలని నిర్ణయానికి వచ్చారు. ఆలయ తూర్పు మాఢ వీధిలో ఉన్న బ్రహ్మోత్సవ మండప సమీపంలో భారీ డిజిటల్ స్క్రీన్‌ను ఏర్పాటు చేయాలని స్థలాన్ని పరిశీలించారు. ప్రధానాలయంలో జరిగే స్వామి వారి పూజ కార్యక్రమాలను ఈ స్క్రీన్‌పై భక్తులు వీక్షించేలా ఏర్పాటు చేయడానికి ఆనంద్‌సాయితో ఈఓ చర్చించారు. త్వరలోనే ఈ పనులపై అధికారికంగా దేవాలయాల అధికారులు పనులు ప్రారంభించనున్నారు. భక్తులకు ఆధ్యాత్మికత, ఆహ్లాదం పంచేందుకు శుక్ర, శని, ఆదివారం రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మునుగోడులో మైనర్లకు మద్యం విక్రయాలు !

- వ్యాపారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపణలు
- మైనర్లు పర్మిట్ రూంలో మద్యం తాగుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్
- ఎక్సైజ్ అధికారుల తీరుపై విమర్శలు



ముగోడులో ఓ మద్యం దుకాణంలోని పర్మిట్ రూంలో పెద్దలతో కూర్చున్న మైనర్లు

మునుగోడు: మద్యం వ్యాపారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఇష్టారాజ్యాంగా మైనర్లకూ విక్రయిస్తూ వారిని మద్యానికి బానిసలుగా మారుస్తున్నారనే ఆరోపణలు మునుగోడులో బలంగా వినిపిస్తున్నాయి. వ్యాపారులు ఏకంగా తమ దుకాణంలోని సిట్టింగ్ పర్మిట్ రూమ్‌లో కూర్చొని మద్యం తాగేందుకు సైతం అవకాశం కల్పిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. మునుగోడు నియోజక వర్గ కేంద్రంలోని చౌటుప్పల్ రోడ్డులో గల ఓ మద్యం దుకాణం వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇటీవల ఇదే దుకాణం పర్మిట్ రూంలో ఇద్దరు మైనర్లు, ఇద్దరు మేజర్లు మద్యం సేవించడాన్ని ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌లో బంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయినా ఆ దుకాణం నిర్వాహకుల్లో ఎలాంటి మార్పు కన్పించడం లేదని పలువురు వాపోతున్నారు. మైనర్లకు మద్యం విక్రయాలు కొనసాగించడంతో పాటు ఉదయం 10గంటల తరువాత తీయాల్సిన దుకాణాలు ఒక్కో రోజు గంట, అర గంట ముందే తెరవడం, రాత్రి సమయంలో గంట ఆలస్యంగా మూసివేస్తున్నారు. ఇవి సంబంధిత శాఖ అధికారుల దుకాణాలని ఎప్పటికప్పుడు పరివేక్షించకపోవడంతో పాటు నిబంధనలు అతిక్రమించినా చూసి చూడనట్లు వదిలేయడంతోనే వ్యాపారులు ఇలా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని మునుగోడు మద్యం వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

యాదాద్రి కొండపై భక్తుల ఘర్షణ



ఘర్షణ పడుతున్న భక్తులను సముదాయిస్తున్న ఎస్‌పీఎఫ్ పోలీసులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండపైన గల బస్టాండ్‌లో పలువురు భక్తులు ఘర్షణ పడ్డారు. స్థానిక భక్తులు, ఎస్‌పీఎఫ్ పోలీస్ సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన రెండు కుటుంబాల భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బుధవారం కొండపైకి వెళ్లే బస్సు ఎక్కారు. సీట్లలో కూర్చునే క్రమంలో రెండు కుటుంబాల భక్తుల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ క్రమంలో ఓ మహిళ మరో మహిళ తీవ్ర పదజాలంతో దూషించుకుని ఘర్షణకు దిగారు. బస్సులోనే ఒకరిపై ఒకరు దాడి చేసుకొని కొండపైకి వచ్చారు. కొండపైన బస్టాండ్‌లో సైతం భక్తులు తీవ్ర ఘర్షణకు పాల్పడటంతో ఎస్‌పీఎఫ్ పోలీసులు, ఆలయ సిబ్బంది, తోటి భక్తులు కలుగజేసుకొని వారిని సముదాయించారు. ఎస్‌పీఎఫ్ పోలీసులు రెండు కుటుంబాల భక్తులను పట్టణ పోలీసులకు అప్పగించారు.

నెమిలలో పార్శ్వనాథుని విగ్రహ శకలం లభ్యం



పార్శ్వనాథుడి విగ్రహ శకలం

రాజాపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని నెమిల గ్రామంలో బుధవారం కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కుండె గణేష్ జైనధర్మానికి చెందిన 23వ జైనతీర్థంకుడు పార్శ్వనాథుని విగ్రహ శకలాన్ని గుర్తించారు. 22వ జైనతీర్థంకరుడు నేమినాథుని పేరు మీదుగా నెమిల గ్రామం నామకరణం పొందింది. లభ్యమైన విగ్రహశకలం కాయోత్సర్గభంగిమలో ఉంది. ఆజానుభాహుడైన పార్శ్వనాథుని వెనక సుట్లు తిరిగిన ఏడు తలల సర్పం ఉన్న ఆనవాళ్లు కన్పిస్తున్నాయి. ఈ శిల్పం రాష్ట్ర కూటపాలకులు అమోఘవర్షుడు, 2వ కృష్ణుడు కొలనుపాక రాజధానిగా పాలించినప్పుడు నిర్మించారని తెలుస్తోంది. వారి కాలపు శాసనాలు రెండు గుండాల మండలంలోని వెల్మజాలలో లభించాయి. ఇప్పుడు ఈ విగ్రహం లభ్యం కావటంతో ఈ చరిత్రకు బలం చేకూర్చుతుంది.

అర్హతలేకుండా వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోటాచలం
- కోదాడలో ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ



కోదాడలో న్యూ నాగార్జున వైద్యశాలను సీజ్ చేస్తున్న అధికారులు

కోదాడ: అర్హతలేకుండా వైద్యం చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్‌ఓ కోటా చలం హెచ్చరించారు. విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించి, ఎంసీఐ స్క్రీనింగ్ టెస్ట్ పాస్‌కాకుండానే కోదాడలో వైద్యశాలలు నిర్వహిస్తూ, వైద్యం చేస్తున్న విషయాన్ని 'రోగుల ప్రాణాలతో చెలగాటం' శీర్షికన ఈ నెల 6న 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం కోదాడలో పలు ప్రైవేట్ వైద్యశాలలను తనిఖీ చేశారు. అర్హత లేని వైద్యులతో నిర్వహిస్తున్న హుజూర్‌నగర్ రోడ్డులోని న్యూ నాగార్జున వైద్యశాలను సీజ్ చేశారు. అజాద్‌నగర్‌లో ఉన్న సాకేతకృష్ణ వైద్యశాలను తనిఖీ చేసి బోర్డుపై వైద్యుడి పేరు చివరన విద్యార్హతల్లో రాసుకున్న ఎండీ డిగ్రీని తొలగించాలని ఆదేశించారు. ఈ వైద్యశాలలో నిర్వహిస్తున్న ఫార్మసీలో ఫార్మసిస్ట్ లేడని ఈవిషయంపై జిల్లా ఔషధ నియంత్రణ అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. శ్రీ సాయిదుర్గ వైద్యశాలను తనిఖీ చేసి విదేశాల్లో చదివి స్క్రీనింగ్ టెస్ట్ పాస్‌కాకుండా వైద్యం చేస్తున్న డాక్టర్‌ను ప్రాక్టీస్ చేయవద్దని ఆదేశించారు. అనంతరం

సాక్షి ఎఫెక్ట్..

ఆయన మాట్లాడుతూ విదేశాల్లో చదివిన వారు తప్పనిసరిగా స్క్రీనింగ్ టెస్ట్ పాస్ అయిన తరువాతే ప్రాక్టీస్ చేయాలని, పేర్ల చివరన ఎండీ డిగ్రీలు పెట్టుకోవద్దని, నిబంధనలు పాటించకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఇదిలా ఉండగా అధికారులు విదేశాల్లో చదివి స్క్రీనింగ్ టెస్ట్ పాస్‌కాకుండా ప్రాక్టీస్ చేస్తున్న కొంత మంది వైద్యుల పట్ల ఉదారంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. కోదాడలో మరో ఐదు వైద్యశాలలు ఇదే విధంగా అర్హతలు లేని వారితో నిర్వహిస్తున్నా అధికారులు వారి జోలికి వెల్లకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్, డాక్టర్ పి. వెంకటరమణ, చంద్రశేఖర్, అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.





దేవస్థానం నిర్ణయించిన ధరకే విక్రయించాలి

- కొబ్బరికాయల వ్యాపారులకు యాదాద్రి ప్రధానాలయ ఈఓ భాస్కర్‌రావు ఆదేశం



కొబ్బరికాయల వ్యాపారులతో మాట్లాడుతున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో వర్తక సంఘం ఏర్పాటు చేసుకున్న కొబ్బరి కాయలను దేవస్థానం టెండర్‌లో నిర్ణయించిన ధరకే భక్తులకు విక్రయించాలని ఈఓ భాస్కర్‌రావు ఆదేశించారు. ఇటీవల కొబ్బరి కాయలు అధిక ధరలకు అమ్ముతున్నారని భక్తుల నుంచి ఆలయాధికారుల ఫిర్యాదు అందాయి. దీంతో బుధవారం ఈఓ స్వయంగా కొబ్బరికాయల దుకాణాల వద్దకు వెళ్లి పరిశీలించారు. అధిక ధరలకు కొబ్బరికాయలు విక్రయిస్తే టెండర్లు రద్దు చేస్తామని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేవస్థానం నిర్ణయించిన ధరల పట్టికను కచ్చితంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రసాదాల తయారీ, అమ్మకాలను పరిశీలించారు. ప్రసాదంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని సంబంధింత శాఖ అధికారులను హెచ్చరించారు. ప్రతి రోజు భక్తుల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, సమస్యలు రాకుండా పరిష్కరిస్తామన్నారు.

చెట్టును ఢీకొట్టిన ట్రాక్టర్.. బాలుడు మృతి



విశ్వతేజ(ఫైల్)

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : ట్రాక్టర్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన కేశపోయిన శ్రీశైలం, సుకన్యల కుమారుడు విశ్వ తేజ(14) సూర్యాపేటలోని జయ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఉగాది పండుగ సెలవులకు గ్రామానికి వచ్చిన విశ్వతేజ గ్రామానికి చెందిన పబ్బతి గణేష్‌కు చెందిన ట్రాక్టర్‌తో డ్రైవర్ బొలక గణేష్ మట్టి తరలిస్తుండగా అతనితో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ తాను నడుపుతానని విశ్వతేజ కోరడంతో గణేష్ అతడికి ఇచ్చి పక్కనే కూర్చున్నాడు. ట్రాక్టర్ శంభుని చెరువు కట్టపైకి రాగానే అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్టీరింగ్ తగిలి విశ్వతేజకు తీవ్ర, గణేష్ స్వల్పంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం విశ్వతేజను 108లో సూర్యాపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

సూర్యాపేట : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట పట్టణ పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...పిల్లలమర్రి చెందిన ఇరుగు మల్లేష్(22) బైక్‌పై సూర్యాపేట నుంచి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో మల్లేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రూ.1.30లక్షల నగదు స్వాధీనం

చిట్యాల: మండల పరిధిలోని వట్టిమర్తి గ్రామ శివారులో జాతీయ రహదారిపై బుధవారం పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో అనుమతులు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు పట్టుకున్నారు. చిట్యాల ఎస్‌ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. వట్టిమర్తి గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.30లక్షల నగదును పట్టుకున్నారు. ఆ నగదును జిల్లా అధికారులకు అందజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నగల దుకాణంలో చోరీ



వివరాలు సేకరిస్తున్న సీఐ చరమందరాజు, ఎస్‌ఐ సైదులు

గరిడేపల్లి : గుర్తుతెలియని నగల దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో జరిగింది. కీతవారిగూడెం గ్రామానికి చెందిన రాజేష్ నగల దుకాణం నడుపుతున్నాడు. రోజులాగానే మంగళవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం దుకాణం వద్దకు వచ్చి చూడగా చిన్న షెట్టర్ పైకి లేపి ఉండడంతో పాటు లోపల వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ చరమందరాజు, ఎస్‌ఐ సైదులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి రూ.2.20లక్షలు అపహరించినట్లు గుర్తించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేధింపుల కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు

సంస్థాన్ నారాయణపురం: వరకట్నం వేధింపుల కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ భువనగిరి జిల్లా మొదటి న్యాయమూర్తి మారుతిదేవి బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా .. సంస్థాన్ నారాయణపురం మండలం గుడిమల్కాపురం గ్రామానికి చెందిన సయ్యద్ అస్మాకు జనగామ గ్రామానికి చెందిన సయ్యద్ షరీఫ్‌తో డిసెంబర్ 2018లో వివాహం జరిగింది. భర్త షరీఫ్, అత్తమామలు మౌలానా, ఫాతిమా వేధింపులు భరించలేక అస్మా 2019వ సంవతరం జూన్ 29న ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వాదపవాదనల అనంతరం నిందితులపై కేసు రుజువు కావడంతో ఐపీసీ సెక్షన్ 498(ఏ)304(బీ)ల ప్రకారం ఒక్కొక్కరికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారని పోలీసులు తెలిపారు.

రెండేళ్లలో రిటైర్‌మెంట్.. టెట్‌కు దరఖాస్తు

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలం లింగగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పీవీ దుర్గాప్రసాద్ 59 ఏళ్ల వయస్సులో బుధవారం టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 1989 బ్యాచ్‌కు చెందిన తాను పదేళ్లుగా ఎస్జీటీగా పనిచేసి 1999లో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్‌తో పని చేస్తున్నానని తెలిపారు. గతంలో జీటీస్, ఎగ్జిక్యూటీవ్ టెస్ట్ పాసైనట్లు తెలిపారు. రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్న మాలాంటి ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రాయడం చాలా ఇబ్బందికరంగా ఉంటుందని వాపోయారు.



టెట్‌కు దరఖాస్తు చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్

ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలి

- కేవీకే డైరెక్టర్ ఘంటా అమరేందర్‌రెడ్డి



చిరుధాన్యాలతో ఉత్పత్తుల తయారీపై శిక్షణ పొందుతున్న మహిళలు

గరిడేపల్లి : మహిళలు స్వశక్తితో ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకోవాలని కేవీకే డైరెక్టర్ ఘంటా అమరేందర్‌రెడ్డి సూచించారు. గడ్డిపల్లిలోని కృషివిజ్ఞాన కేంద్రంలో బుధవారం షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళలకు చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఇస్తున్న శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆహారంలో చిరుధాన్యాలు ఉపయోగించటం వలన ఆరోగ్యానికి ఎంతో మేలన్నారు. కేవీకే ఇంచార్జి పోగ్రాం కో ఆర్డినేటర్ నరేష్ మహిళలు గ్రూప్స్‌గా ఏర్పడి ఇంటి దగ్గరే ఉండి చిరుధాన్యాలతో విలువాధారిత ఉత్పత్తులను తయారు చేసుకొని మార్కెటింగ్ చేసుకోవడం ద్వారా ఉపాధి పొందవచ్చని తెలియజేశారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎన్. సుగంధి చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు మొదలైన వాటితో చేసుకోదగిన ఉత్పత్తులపై వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఎ. కిరణ్‌తో పాటు మహిళలు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన తిరుమలగిరి మున్సిపాలిటీ పాలకవర్గం



హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాస గృహంలో బుధవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆధ్వర్యంలో తిరుమలగిరి మున్సిపాలిటీ పాలకవర్గం కలిసింది. సీఎంను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ త్వరలో జరిగే భువనగిరి పార్లమెంటులో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, వైస్ చైర్మన్ కేశిడి సరళాయాదవరెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్, జమ్మిలాల్, ఉంకరి జనార్దన్, కందుకూరి లక్ష్మయ్య, దాచేపల్లి వెంకన్న, తిరుమని యాదగిరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో ఆకట్టుకున్న యక్షగాన ప్రదర్శన



బాలనాగమ్మ చరిత్ర యక్షగాన ప్రదర్శనలో సన్నివేశాలు

చౌటుప్పల్ : శ్రీక్రోధినామ తెలుగు సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను గ్రామీణ కళల పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి చౌటుప్పల్‌లో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా సేవాసమితి 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక చిన్నకొండూర్‌రోడ్‌లో కచ్చీరు (దొరవారి ఇల్లు) వద్ద బాలనాగమ్మ చరిత్ర యక్షగానం ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రామీణ కళాకారులు తమ వేషధారణలు, కళా ప్రదర్శనలతో ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నారు. పెద్ద సంఖ్యలో కళాభిమానులు తరలివచ్చారు. వివిధ రంగాల్లో విశిష్టంగా సేవలందించిన వారితో పాటు కళాకారులను ఘనంగా సన్మానించారు. గ్రామీణ కళల పరిరక్షణ సమితి అధ్యక్షుడు పోలోజు శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి సైదులుగౌడ్, నిర్వాహక ప్రతినిధులు ఎరుకల మల్లేశం, చిక్క నర్సింహ, వీసం చంద్రారెడ్డి, సుర్కంటి వెంకట్ రెడ్డి, దొడ్డి రాములు, బడుగు బాలరాజు, చిట్టిప్రోలు వెంకటేష్, చింతకింది అంజయ్య, గ్యార కిష్టయ్య, బొడిగె ప్రభాకర్, కొండూరు వెంకన్న, స్థానికులు బడుగు లక్ష్మయ్య, బత్తుల శ్రీశైలం, బొబ్బిళ్ల మురళి, బడుగు శ్రీరాములు, పోలోజు రాజుచారి, తాడూరి పరమేష్ ఉన్నారు.